

సీలేరులో బలిమెల జలాశయం నీటి వినియోగంపై సమావేశమైన ఆంధ్రా-ఒడిశా అధికారులు

తేలిన బలిమెల నీటి లెక్కలు

బలిమెల, జోలాపుట్ జలాశయాల్లో 131.6154 టీఎంసీలు

- ఏపీ వాటా 70.0195టీఎంసీలు, ఒడిశా వాటా 61.5959 టీఎంసీలు
- బలిమెల నీటి మట్టం 1512.50 అడుగుల కంటే పెరగకుండా నీటిని వినియోగించుకోవాలి
- ఆంధ్రా, ఒడిశా అధికారుల నిర్ణయం

సీలేరు, సెప్టెంబరు 19 :

ఆంధ్రా-ఒడిశా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయం నీటి వినియోగంపై ఇరు రాష్ట్రాల అధికారులు గురువారం సీలేరులో సమావేశమై లెక్కలు తేల్చారు. 2024-2025 నీటి సంవత్సరంలో రెండు రాష్ట్రాలు బలిమెల నుంచి ఎంతెంత నీటిని వినియోగించుకోవాలో లెక్కలు కట్టారు. ఆగస్టు నెలలో ఆంధ్రా తన వాటాగా 4.0180 టీఎంసీలు, ఒడిశా 8.2886 టీఎంసీలు వినియోగించుకున్నట్టు లెక్కలు కట్టారు. దీని ప్రకారం ఆగస్టు నెలలో ఆంధ్రా కంటే ఒడిశా 4.2706 టీఎంసీలు నీటిని అధికంగా వినియోగించినట్టు తేల్చారు. అలాగే జూలై 2024 నుంచి ఆగస్టు 31 నాటికి ఆంధ్రా 7.5405 టీఎంసీలు నీటిని వినియోగించుకుందని, అలాగే ఒడిశా 15.9641 టీఎంసీలు వినియోగించుకున్నట్టు లెక్కలు తేల్చారు. దీని ప్రకారం 2024-2025 పీటి సంవత్సరంలో ఆంధ్రా కంటే ఒడిశా 8.4236 టీఎంసీలు అధికంగా వినియోగించుకున్నట్టు లెక్కలు కట్టారు. ఇటీవల ఈ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు ప్రస్తుతం బలిమెల, జోలాపుట్ జలాశయాల్లో కలిపి 131.6154 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నట్టు లెక్కించారు. ఇందులో ఆంధ్రా వాటాగా 70.0195 టీఎంసీలుగా, ఒడిశా వాటా 61.5959 టీఎంసీలుగా పంపకాలు జరిపారు. ప్రస్తుతం ఇక్కడ కురుస్తున్న భారీ వర్షాలకు బలిమెల జలాశయం నీటి మట్టం 1612.60 అడుగుల నీటి మట్టానికి చేరిందని, ఎగువ నుంచి ఇన్‌ఫ్లో వస్తుండడంతో బలిమెల నీటి మట్టం పెరిగి పరిసర గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉన్నందున బలిమెల నీటి మట్టం 1512.50 అడుగులకు ... మిగతా 6వ పేజీలో

రానున్న ఐదేళ్లకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

- జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్
- స్వర్ణాంధ్ర-2047పై అవగాహన ఏర్పరచుకోవాలి




అధికారులతో సమావేశమైన జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ్

పాడేరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రానున్న ఐదేళ్లలో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో గురువారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. 2029 నాటికి జిల్లాలోని వివిధ రంగాల్లో 15 శాతం వృద్ధి సాధించేందుకు అనుగుణంగా అధికారులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రధానంగా వ్యవసాయం, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్యశాఖ, పారిశ్రామిక, విద్య, వైద్యం, సేవా, పర్యాటక రంగాల్లో 15 శాతం వృద్ధి సాధించేందుకు ప్రణాళికలను ఈనెలాఖరు నాటికి రూపొందించాలన్నారు. స్థూల ఆర్థికాభివృద్ధి పెరిగేందుకు అవకాశమున్న రంగాలను ప్రాధాన్యతగా పరిగణించి ప్రణాళికలు రూపొందించాలన్నారు. అవన్నీ సీఎం చంద్రబాబునాయుడు పేర్కొనే స్వర్ణాంధ్ర- 2047 లక్ష్యాలను చేరుకునేందుకు అనువుగా ఉండాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. స్వర్ణాంధ్ర-2047పై అధికారులంతా అవగాహన ఏర్పరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి, జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి ఎస్ఎన్ఆర్‌కే.పట్నాయక్, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నంద్, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, ఉద్యానవనాధికారి రమేశ్‌కుమార్‌రావు, మత్స్యశాఖ ఏడీ శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల అధికారి వాణిధర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల్లో రోడ్లకు మహర్దశ

- ఉపాధి హామీలో తారు, సీసీ రహదారుల నిర్మాణం
- ఎట్టకేలకు వంజంగి, యర్రవరం ప్రాంతాలకు సదుపాయం



హుకుంపేట మండలం మత్స్యగుండం ప్రాంతానికి వేసిన తారురోడ్డు

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని పలు ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలకు జాతీయ ఉపాధి హామీ పథకం రోడ్డు సదుపాయం సమకూరనుంది. గిరిజన ప్రాంతంలో అనేక పర్యాటక ప్రదేశాలున్నప్పటికీ, వాటి అభివృద్ధిపై గత పాలకులు పట్టించుకోకపోవడంతో కనీస రోడ్డు సదుపాయానికి సైతం నోచుకోని దుస్థితి కొనసాగింది. ఈ తరుణంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో ఆయా ప్రాంతాలకు రోడ్డు సదుపాయం కల్పించాలని అధికారులు భావించారు. దీంతో రెండు నెలల క్రితమే ఆయా పనులకు ప్రభుత్వం నుంచి అనుమతి పొందారు. దీంతో పలు పనులు చేపడుతుండగా, మరికొన్ని ప్రారంభంలో ఉన్నాయి. అయితే ఆయా పనులన్నీ మరో నెలన్నరలో పూర్తి చేసి ఈ ఏడాది పర్యాటక సీజన్ నాటికి రోడ్లు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

వంజంగి హిల్స్ రూ.2.5 కోట్లతో రోడ్డు

పాడేరు మండలంలో ఎంతో ప్రాచుర్యం పొందిన వంజంగి హిల్స్‌కు ఎటువంటి రోడ్డు సదుపాయం లేకపోవడంతో ప్రతి ఏడాది సందర్శకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా అక్కడ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు రూ.2.5 కోట్లు మంజూరు చేశారు. దీంతో మరో నెల రోజుల్లో వంజంగి హిల్స్ రాకపోకలకు మార్గం సుగమం కానుంది.

జిల్లాలో పలు పర్యాటక ప్రాంతాలకు నిర్మించే రోడ్ల వివరాలు

- కొయ్యూరు మండలం గాదెగుమ్మి జలపాతానికి రూ.30 లక్షలతో సీసీ రోడ్డు.
- జీకేవీధి మండలం బోడకొండమ్మ జలపాతానికి రూ.30 లక్షలతో సీసీ రోడ్డు
- రంపచోడవరం డివిజన్‌లో గుడెసె, పెడమ్రి ప్రాంతానికి రూ.10 కోట్లతో తారు, సీసీ రోడ్లు
- పాడేరు మండలం డల్లాపల్లికి రూ.3.26 కోట్లతో తారు రోడ్డు
- జీకేవీధి మండలం యర్రవరం జలపాతానికి రూ.2 కోట్లతో తారు రోడ్డు
- జి.మాడుగుల మండలం కొత్తపల్లి జలపాతం సమీపంలో రూ.కోటి 65 లక్షలతో సీసీ రోడ్డు
- హుకుంపేట మండలం మత్స్యగుండానికి రూ.4.50 కోట్లతో తారురోడ్డు
- అనంతగిరి మండలం కటిక జలపాతానికి రూ.13 కోట్లతో తారురోడ్డు
- అరకులోయ మండలం రణజిల్లెడ జలపాతానికి రూ.5.5 కోట్లతో తారురోడ్డు
- చింతపల్లి మండలం లంబసింగి టూరిజం రిసార్ట్స్ వద్ద రూ.20 లక్షలతో సీసీ రోడ్డు

ఆదివాసీలకు నిలిచిన వైద్యం

జీకేవీధి పీహెచ్‌సీకి భారీగా తరలివచ్చిన రోగులు

- వైద్యులు అందుబాటులో లేక నిరాశతో వెనుదిరిగిన వైనం
- గర్భిణులకు అందని వైద్య సేవలు



రోగులకు సాధారణ పరీక్షలు చేస్తున్న స్టాఫ్‌నర్సులు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 19:



చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చి రోగులు

మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు మెరుగైన వైద్యం అందడం లేదు. పీహెచ్‌సీ వైద్యులు సమ్మె చేపడుతుండడంతో ఆస్పత్రిలో స్టాఫ్ నర్సులు మాత్రమే అందుబాటులో ఉన్నారు. గురువారం వారపు సంత కావడంతో జీకేవీధి పీహెచ్‌సీకి సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో రోగులు తరలి వచ్చినా వైద్యులు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర నిరాశతో స్వగ్రామాలకు వెళ్లిపోయారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సాధారణ రోజుల కంటే వారపు సంత రోజు అత్యధిక సంఖ్యలో రోగులు వస్తుంటారు. సోమ, గురువారాలు జీకేవీధి, ఆర్‌వీనగర్ పీహెచ్‌సీలకు 120 నుంచి 150మంది రోగులు వస్తుంటారు. వారపు సంత కావడంతో సుదూర ప్రాంతాల నుంచి జ్వరాలు, అతిసార, దగ్గు, జలుబుతోపాటు గర్భిణులు అధిక సంఖ్యలో జీకేవీధి పీహెచ్‌సీకి వచ్చారు. వైద్యుల సమ్మె కారణంగా ... మిగతా 6వ పేజీలో

మన్యంలో కుండపోత

జనజీవనానికి అంతరాయం

పాడేరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):



అనంతగిరిలో వర్షం

మన్యంలో గురువారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేని వర్షం కురిసింది. దీంతో జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. జిల్లా కేంద్రం పాడేరు మొదలుకుని అన్ని మండలాల్లోనూ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం మూడు గంటల వరకు జిల్లా వ్యాప్తంగా తీవ్రమైన ఎండ కాసింది. ఆ తర్వాత ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. తాజా వర్షానికి రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షం కురవగా.. మిలిగిన మండలాల్లో భారీ వర్షం కురిసింది. అయితే తాజా వర్షానికి ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు వాటిల్లలేదు.

కాఫీ పల్పింగ్ యూనిట్ అందుబాటులోకి వచ్చేనా?

నిధులు విడుదల కాక నిలిచిన నిర్మాణాలు

- ఏడాదిన్నర నుంచి ముందుకు సాగని పనులు
- తుప్పుపడుతున్న యంత్రాలు
- రవాణా ఖర్చులు, బోనస్‌ను నష్టపోతున్న కాఫీ రైతులు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 19:

మండల కేంద్రంలో ఐటీడీఏ ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఎకో పల్పింగ్ యూనిట్ ఈ ఏడాది కాఫీ సీజన్ నాటికి అందుబాటులోకి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఏడాదిన్నర క్రితం కాంట్రాక్టర్ పనులు అర్థంతరంగా నిలిపివేశారు. యంత్రాలు ఇన్‌స్టాల్ చేయకపోవడంతో తుప్పు పడుతున్నాయి. ఫలితంగా కాఫీ రైతులు నష్టపోతున్నారు.



బయట పడేసి ఉన్న పల్పింగ్ యంత్రాలు

గిరిజన రైతులు పండించిన కాఫీ పండ్ల పార్చిమెంట్‌కు రూ.1.3 కోట్లతో గూడెంకొత్తవీధిలో ఎకో పల్పింగ్ యూనిట్‌కు ఐటీడీఏ రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించింది. మూడు నెలల్లో పనులు పూర్తి చేయాలని ఐటీడీఏ లక్ష్యాన్ని నిర్దేశించింది. గత ఏడాది కాఫీ సీజన్ నాటికే ఎకో పల్పింగ్ యూనిట్ అందుబాటులోకి తీసుకొస్తామని ఐటీడీఏ అధికారులు ప్రకటించారు. అయితే నిర్మాణాలకు సంబంధించిన నిధులను వైసీపీ ప్రభుత్వం సకాలంలో విడుదల చేయకపోవడంతో పనులు పూర్తి కాలేదు. కాంట్రాక్టర్ రూ.40 లక్షలు వ్యయం చేసి 70 శాతం నిర్మాణాలు పూర్తి చేశారు. ఈ నిధులు రెండు నెలలు క్రితం కాంట్రాక్టర్‌కు అందాయి. అయితే పనులు పూర్తి చేసేందుకు అదనపు నిధులు అవసరం. ఈ నిధులు విడుదల కాకపోవడంతో నేటికి పనులు ప్రారంభంకాలేదు.



అసంపూర్తిగా దర్శనమిస్తున్న ఎకో పల్పింగ్ యూనిట్ భవనం

నిరుపయోగంగా పడివున్న యంత్రాలు

ఎకో పల్పింగ్ యూనిట్ కోసం కొనుగోలు చేసిన యంత్రాలు నిరుపయోగంగా పడివున్నాయి. ఈ యూనిట్‌కి అవసరమైన యంత్రాలు రూ.20లక్షలతో కొనుగోలు చేశారు. నిర్మాణం పూర్తికాకపోవడం వల్ల యంత్రాలు ఇన్‌స్టాల్ చేసే పరిస్థితి లేదు. ప్రధానంగా ఎకో పల్పింగ్ యూనిట్ వద్ద పైకప్పు నిర్మాణం, యంత్రాలు ఇన్‌స్టాల్ చేసేందుకు విద్యుత్ సరఫరా ఉండాలి. ఎకో పల్పింగ్ యూనిట్‌కి విద్యుత్ కనెక్షన్ తీసుకోవడానికి ఈపీడీసీఎల్ అధికారులకు రూ.8లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. విద్యుత్ కనెక్షన్‌కి సంబంధించిన నిధులు సైతం ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో ఎకో పల్పింగ్ యూనిట్ వద్ద పనులు చేపట్టే అవకాశం లేకుండా పోయింది.

కాఫీ ఉత్పత్తిలో జీకేవీధి అగ్రగామి

జిల్లాలో గూడెంకొత్తవీధి మండలం కాఫీ ఉత్పత్తిలో అగ్ర స్థానంలో ఉంది. మండలంలో ఆదివాసీ రైతులు అత్యధికంగా 42 వేల ఎకరాల్లో కాఫీ సాగు చేస్తున్నారు. సరైన సేద్య పద్ధతులు పాటించకపోవడం వల్ల ఆశించిన దిగుబడులు రావడం లేదు. అయినా ప్రతి ఏడాది 4,200 టన్నుల క్లీన్ ఉత్పత్తి చేస్తున్నారు. ఐటీడీఏ సహకారంతో మ్యాక్స్ కాఫీ పండ్లకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నది. గత ఏడాది కిలో కాఫీ పండ్లకు రూ.43 గరిష్ఠ ధరను అందజేశారు. గిరిజన రైతులు కాఫీ పండ్లను మ్యాక్స్ ద్వారా మార్కెటింగ్ చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇక్కడ ఎకో పల్పింగ్ యూనిట్ అందుబాటులోకి రాకపోవడంతో కాఫీ పండ్లను రైతులు చింతపల్లి పల్పింగ్ యూనిట్‌కి తరలించుకోవాల్సి వస్తున్నది. దీంతో రవాణా ఖర్చు పెరుగుతున్నది. ఫలితంగా రైతులకు వచ్చే బోనస్ తగ్గుతోంది. ఇప్పటికైన జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో స్పందించి ఎకో పల్పింగ్ యూనిట్ పనులు పూర్తి చేయాలని కాఫీ రైతులు వేడుకుంటున్నారు.

ఎస్ఐ కొలువు సాధించిన గిరిజన యువకుడు

- ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో విద్యాభ్యాసం
- తండ్రి మరణిస్తే కూలి పనులు చేసి చదివించిన తల్లి
- పేదరికంలోను లక్ష్యాన్ని సాధించిన లంబసింగి కుర్రోడు సాయిరామ్ పడాల్
- అనంతపురం పోలీసు ట్రైనింగ్ కళాశాలలో శిక్షణ



తల్లి గోవిందమ్మ, అక్కలతో సాయిరామ్ పడాల్

చింతపల్లి, సెప్టెంబరు 19:

చిన్న వయస్సులోనే తండ్రి మరణించడంతో తల్లి కూలి పనులు చేసుకుంటూ కొడుకును చదివించింది. ప్రాథమిక విద్య నుంచి డిగ్రీ వరకు ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో విద్యాభ్యాసం చేశాడు. పేదరికంలో పెరిగిన గిరిజన యువకుడు కృషి, పట్టుదలతో చదివి సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం అనంతపురం పోలీసు ట్రైనింగ్ కళాశాలలో శిక్షణ పొందుతున్నాడు. అతడే లంబసింగికి చెందిన బోనంగి సాయిరామ్ పడాల్.



సాయిరామ్ పడాల్

మండలంలోని లంబసింగికి బోనంగి సత్యనారాయణ పడాల్, గోవిందమ్మల చిన్న కుమారుడు సాయిరామ్ పడాల్. సత్యనారాయణ పడాల్ గిరిజన సహకార సంస్థలో సేల్స్‌మన్‌గా పనిచేస్తూ 2008లో అనారోగ్యంతో మృతి చెందారు. జీసీసీలో కారుణ్య నియామకాలు లేకపోవడంతో గృహిణి అయిన భార్య గోవిందమ్మకు ఎటువంటి ఉద్యోగం రాలేదు. అప్పటి వరకు గృహిణిగా ఉన్న ఆమె కుటుంబ పోషణ కోసం వ్యవసాయ కూలిగా మారింది. గ్రామంలో కూలి పనులు చేసుకుంటూ ... మిగతా 6వ పేజీలో

సింహాచలం దేవస్థానం ఈఓగా వేండ్ర త్రినాథరావు

- గతంలో పలుమార్లు ఇన్‌చార్జిగా బాధ్యతల నిర్వహణ



నూతన ఈఓ వేండ్ర త్రినాథరావు

సింహాచలం, సెప్టెంబరు 19: సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారిగా దేవదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్, ప్రస్తుతం ద్వారకా తిరుమల వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఈఓగా పనిచేస్తున్న వేండ్ర త్రినాథరావును నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఏడాదికాలంపాటు డిప్యుటేషన్‌పై ఈఓగా పనిచేసిన రెవెన్యూ శాఖకు చెందిన డిప్యూటీ కలెక్టర్ సింగాల శ్రీనివాసమూర్తిని మాతృశాఖకు బదిలీ చేస్తూ దేవదాయ శాఖ స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. ఆయన స్థానంలో విశాఖ జిల్లా దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాతను దేవస్థానం ఇన్‌చార్జి ఈఓగా ప్రభుత్వం నియమించింది. ఆమె ఈనెల 17న బాధ్యతలు స్వీకరించారు. అయితే గురువారం త్రినాథరావును నియమిస్తూ దేవదాయ శాఖ స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు ఇచ్చారు. త్రినాథరావు దేవస్థానానికి ఇన్‌చార్జి ఈఓగా 2020 సెప్టెంబరు 2 నుంచి 2021 జనవరి 22 వరకు ఒకసారి, 2022 సెప్టెంబరు 22 నుంచి 2023 జూన్ 10 వరకు మరోసారి, 2023 ఆగస్టు 26 నుంచి 2023 సెప్టెంబరు 17 వరకు ఇంకొకసారి విధులు నిర్వహించారు.

క్రైం... crime news

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి



దుర్గాప్రసాద్ (ఫైల్)

నాతవరం, సెప్టెంబరు 19: మండలంలోని ఎం.బెన్నవరంలో ఇంటి యాజమానికి ఎలక్ట్రీషియన్‌కు సమన్వయ లోపం వలన ఓ నిండుప్రాణం బలైంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఎం.బెన్నవరంలోని ఓ ఇంట్లో మొండెం దుర్గాప్రసాద్ (24)తో పాటు మరో ఇద్దరు ఎలక్ట్రికల్ పనులు చేస్తున్నారు. వీరు పనులు చేసేటప్పుడు విద్యుత్ సరఫరాతోపాటు ఇన్వర్టర్ కూడా ఆపివేశారు. బుధవారం మధ్యాహ్నం వీరు పనులు ముగించుకుని ఇంటికి వచ్చేసి సాయంకాలం తిరిగి అదే ఇంట్లో పనికి వెళ్లారు. అయితే ఇంటి యాజమానికి ఈ విషయం తెలియకపోవడంతో ఇన్వర్టర్‌ను ఆన్ చేసి ఉంచారు. దీంతో పనులు నిర్వర్తిస్తుండగా బుధవారం సాయంత్రం దుర్గాప్రసాద్ విద్యుదాఘాతానికి గురవడంతో మృతి చెందాడు. స్థానిక పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు దుర్గాప్రసాద్‌కు భార్య, కుమారుడు ఉన్నారు.

12 మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 19: పూల్‌బాగ్‌కు వెళ్లే జంక్షన్ వద్ద ఓ వ్యక్తి నుంచి 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని బుధవారం రాత్రి కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. పాత జగన్నాథ థియేటర్ ప్రాంతానికి చెందిన వానపల్లి నాగరాజు సంచిలో మద్యం బాటిళ్లు పట్టుకుని వెళుతుండగా పూల్‌బాగ్‌కు వెళ్లే జంక్షన్ వద్ద అనుమానం వచ్చి తనిఖీ చేయగా 12 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయని, వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 19: మండలంలో సంకాడ పంచాయతీ ఉసిరి గూడెంలో పేకాట ఆడుతున్న నలుగురు జూదగాళ్లను అరెస్టు చేసినట్టు ఎస్సై అప్పలసూరి తెలిపారు. నిందితుల నుంచి రూ.6,500 స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

22.69 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 19: మండలంలో ధారకొండ ప్రాంతం నుంచి మైదాన ప్రాంతాలకు ద్విచక్రవాహనంపై గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ అప్పలసూరి తెలిపారు. బుధవారం సాయంత్రం అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారంతో జీకేవీధి పాతవీధి జంక్షన్ వద్ద వాహన తనిఖీలు ప్రారంభించామన్నారు. రెండు ద్విచక్రవాహనాల్లో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను గమనించి వెనక్కి వెళ్లిపోయే ప్రయత్నం చేశారు. దీంతో వెంటనే పోలీసుల అప్రమత్తమై ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇద్దరు వ్యక్తుల నుంచి కాలేజీ బ్యాగుల్లో తరలిస్తున్న 22.69 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరు నిందితులు ధారకొండ ప్రాంతానికి చెందిన వ్యక్తులుగా గుర్తించామని, ఇద్దరిని అరెస్టు చేసి కోర్టుకు తరలించామన్నారు. ఈ కేసులో మరో నిందితుడు పరారీలో ఉన్నాడన్నారు.

భార్యాభర్తలపై దాడి చేసిన నిందితుడి ఆత్మహత్య

కశింకోట, సెప్టెంబరు 19: భార్యాభర్తలపై కత్తితో దాడి చేసిన ఓ నిందితుడు నర్సింగబిల్లి - బయ్యవరం మధ్య రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మునగపాక మండలం చూచుకొండ గ్రామంలో అదే గ్రామానికి చెందిన భార్యాభర్తలు కొయిలాడ చంద్రిక, మోహన్‌లపై కత్తితో దాడి చేసిన నిందితుడు కాండ్రేగుల సోంబాబుగా రైల్వే పోలీసులు గుర్తించారు. ఈ మేరకు తుని రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కాగా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు సోంబాబు కోసం గాలింపు చేపట్టిన మునగపాక పోలీసులకు రైల్వే పోలీసులు సమాచారం ఇచ్చారు.

ప్రైవేటు బస్సును ఢీకొన్న లారీ : ఐదుగురికి గాయాలు

ఎలమంచిలి, సెప్టెంబరు 19: మండలంలోని రేగుపాలెం జంక్షన్ సమీప జాతీయ రహదారిపై గురువారం రాత్రి ఓ ప్రైవేటు బస్సును లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఓ ఔషధ తయారీ పరిశ్రమలో పని చేస్తున్న ఉద్యోగులను నక్కపల్లి నుంచి ఎలమంచిలి తీసుకువెళుతుండగా రేగుపాలెం జంక్షన్ వద్దకు వచ్చే సరికి అనకాపల్లి నుంచి అడ్డురోడ్డు వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులోని ఉద్యోగులు ఎన్.ప్రవీణ్, ఆర్.ధనుంజయ, రవి, టి.వేణుగోపాల్, మరొకరికి గాయాలయ్యాయి. వీరందరిని విశాఖ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనకాపల్లిలో రెండు అన్న క్యాంటీన్లు ప్రారంభం

▸▸ ఎన్టీఆర్ వైద్యాలయం, రైల్వే స్టేషన్‌ల వద్ద అందుబాటులోకి..



రైల్వే స్టేషన్ వద్ద భోజనాలు చేస్తున్న ఎమ్మెల్యే, కూటమి నాయకులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 19: పేదల కళ్లల్లో ఆనందం కనిపించింది. గత వైసీపీ పాలనలో మూతపడిన అన్న క్యాంటీన్లు కూటమి ప్రభుత్వ హయాంలో పునఃప్రారంభం కావడంతో సంతోషం వ్యక్తం చేశారు. రూ.5లకే రుచికరమైన భోజనం అందడంతో సంతృప్తిగా భుజించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు.

అనకాపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ వైద్యాలయం, రైల్వేస్టేషన్‌ల వద్ద గురువారం రాత్రి అన్న క్యాంటీన్లను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, జనసేన 80వ వార్డు ఇన్‌చార్జి తాడి రామకృష్ణ సతీమణి శాంతి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి కొణతాల రామకృష్ణ, కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు క్యాంటీన్లలో పేదలకు ఎమ్మెల్యే కొణతాలతో పాటు కూటమి నాయకులు భోజనాలు వడ్డించారు. తొలి రోజు స్వీట్, రైస్, ఆనపకాయ, బంగాళదుంప కూర, పెరుగు, పచ్చడి వడ్డించారు. రైల్వేస్టేషన్ వద్ద ఎమ్మెల్యే కొణతాలతోపాటు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తదితరులు భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైన సందర్భంగా శుక్రవారం నుంచి వారోత్సవాలు నిర్వహించి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, ఈఈ చిరంజీవి, కూటమి నాయకులు కోట్ని బాలాజీ, బత్తుల తాతయ్యబాబు, మాదంశెట్టి నీలబాబు, కాయల మురళి, ఉగ్గిన రమణమూర్తి, పొన్నగంటి అప్పారావు, ఆళ్ల రామచంద్రరావు, తాడి రామకృష్ణ, రాము పాల్గొన్నారు.

తేగాడ మోడల్ స్కూల్‌లో డిప్యూటీ డీఈవో విచారణ

కశింకోట, సెప్టెంబరు 19: మండలంలోని తేగాడ మోడల్ స్కూల్‌లో డిప్యూటీ డీఈవో పి.అప్పారావు గురువారం విచారణ చేపట్టారు. ఈ నెల 4న 'ఆంధ్రజ్యోతి'లో 'తేగాడ మోడల్ స్కూల్‌లో వసూళ్ల పర్వం' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో ఆయన స్పందించారు. స్కూల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి వారి నుంచి వివరాలు సేకరించారు. ఈ నివేదికను విద్యాశాఖ ఉన్నతాధికారులకు పంపుతామని ఆయన చెప్పారు. అయన వెంట ఏంఈవో -2 మూర్తి ఉన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

ఆత్మ గౌరవంతో ఆర్థిక స్వావలంబన సాధించండి

▸▸ దివ్యాంగులకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పిలుపు
▸▸ ఏయూ మెరైన్ గ్రౌండ్‌లో దివ్య కళామేళా ప్రారంభం
▸▸ హాజరైన కేంద్ర మంత్రి వీరేంద్రకుమార్



దివ్యాంగునికి ట్రై సైకిల్ అందజేస్తున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రి వీరేంద్రకుమార్.

మహారాణిపేట (విశాఖపట్నం), సెప్టెంబరు 19: దివ్యాంగులు ఆత్మ గౌరవంతో ఆర్థిక స్వావలంబన సాధించాలని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆకాంక్షించారు. విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం మెరైన్ గ్రౌండ్స్‌లో 11 రోజులపాటు నిర్వహించే 'దివ్య కళా మేళా'ను కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత శాఖ మంత్రి వీరేంద్రకుమార్‌తో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ విశాఖలో దివ్య కళా మేళాను ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. దివ్యాంగులు అన్ని రంగాల్లో ముందున్నారని, ఎన్‌డీఎఫ్‌డీసీ ద్వారా 1.5 లక్షల మందికి రుణాలు అందించామన్నారు. మేళాలో 20 రాష్ట్రాల దివ్యాంగులు భాగస్వాములవుతున్నారన్నారు. కేంద్ర మంత్రి వీరేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ మనసులో దివ్యాంగులకు ఉన్నత స్థానం ఉందని, వారికి ప్రోత్సాహం అందించాలని సూచించారు. పారా ఒలింపిక్స్‌లో మనదేశం 29 పతకాలు సాధించి దివ్యాంగుల శక్తిని నిరూపించిందన్నారు. మేళాలో వివిధ రాష్ట్రాలకు చెందిన 100 మంది కళాకారులు సేంద్రియ ఆహార ఉత్పత్తులు, పరికరాలు, దుస్తులు, ఇతర ఉత్పత్తులను ప్రదర్శించారు. కేంద్ర, రాష్ట్రాల ప్రతినిధులు స్టాల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు ఉపకరణాలు, రుణ పత్రాలను మంత్రి, గవర్నర్ అంద జేశారు. పలువురికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీ ఎం.శ్రీభరత్, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పాల్గొన్నారు.

పరాయి పంచన గ్రంథాలయం

▸▸ ఎనిమిది దశాబ్దాలుగా అద్దె భవనంలో నిర్వహణ
▸▸ పట్టణ శివారు కావడంతో పాఠకుల ఇబ్బందులు
▸▸ పుస్తకాలు భద్రపరచడానికి వసతి కొరత
▸▸ సొంత భవన నిర్మాణానికి అనువైన స్థలం లభించని పరిస్థితి



గ్రంథాలయంలో పుస్తక భాండాగారం



అద్దె భవనంలో నడుస్తున్న శాఖా గ్రంథాలయం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 19: ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎంతమంది పాలకులు వచ్చినా.. అనకాపల్లిలోని ప్రభుత్వ శాఖా గ్రంథాలయానికి సొంత భవనం ఒనగూరడంలేదు. సుమారు ఎనిమిది దశాబ్దాల నుంచి చాలీచాలని అద్దె భవనాల్లో గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నారు. దీంతో ఇటు సిబ్బంది, అటు పాఠకులు తీవ్ర అసౌకర్యం చెందుతున్నారు. పుస్తకాలు భద్రపరచడానికి వసతి చాలని పరిస్థితి నెలకొంది.

అనకాపల్లి శాఖా గ్రంథాలయాన్ని 1947లో రైల్వే స్టేషన్‌రోడ్డులోని ఒక అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. అప్పట్లో ఈ ప్రాంతంలో నివాసాలు చాలా తక్కువ వుండేవి. కొంతకాలం తరువాత శాఖ వీధిలోని మరో అద్దె భవనంలోకి మార్చారు. సుమారు మూడు దశాబ్దాల నుంచి గ్రంథాలయం ఇక్కడ కొనసాగుతున్నది. ప్రస్తుతం ఈ గ్రంథాలయంలో ఇతిహాసాలు, పురాణాలు, నవలలు, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు, చిన్నపిల్లల పుస్తకాలు సుమారు 30,556 ఉన్నాయి. గ్రేడ్-1లో ఉన్న అనకాపల్లి గ్రంథాలయానికి నిత్యం వంద మందికిపైగా పాఠకులు వస్తుంటారు. ఇదే పట్టణం మధ్యలో ఉంటే వందల మంది ఈ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకునే అవకాశం వుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. తోట నగేశ్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా వున్నప్పుడు అనకాపల్లి వచ్చి శాఖ గ్రంథాలయాన్ని పరిశీలించారు. రూ.50 లక్షలతో అధునాతన హంగులతో సొంత భవనం నిర్మిస్తామని చెప్పారు. కానీ పట్టణం మధ్యలో ఎక్కడా సరైన స్థలం లభించకపోవడంతో ఆ ప్రతిపాదన అటకెక్కింది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అయినా శాఖ గ్రంథాలయం భవన నిర్మాణానికి స్థలంతోపాటు నిధులు కేటాయించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఐదేళ్లగా ఇన్‌చార్జే దిక్కు..

శాఖా గ్రంథాలయ అధికారి ఐదేళ్ల క్రితం పదవీవిరమణ చేశారు. అప్పటి నుంచి తుమ్మపాల గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఒక పూట తమ్మపాలలో, మరో పూట అనకాపల్లిలో విధులు నిర్వహిస్తున్నారు. అనకాపల్లి గ్రంథాలయంలో సుమారు 20 ఏళ్లగా రికార్డు అసిస్టెంట్, అటెండర్ పోస్టులు ఖాళీగా వున్నాయి.

స్థలం లేకనే భవన నిర్మాణం జరగలేదు



గ్రంథాలయం భవన నిర్మాణానికి నిధులు ఇచ్చేందుకు జిల్లా గ్రంథాలయ సంస్థ సిద్ధంగా వుంది. కానీ భవనం నిర్మించడానికి అవసరమైన స్థలంలో పట్టణంలో అందుబాటులో లేదు. ప్రస్తుతం గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్న భవనానికి నెలకు రూ.11 వేలు అద్దె చెల్లిస్తున్నాం. సొంత భవనం ఉంటే పాఠకులకు ఎంతో సౌకర్యంగా వుంటుంది.

కె.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి

గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ శాంతి నిరసన



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 19: కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీపై ఎన్డీయే కూటమి నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఎన్టీఆర్ మార్కెట్‌యార్డులోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద గురువారం కాంగ్రెస్ నాయకులు శాంతియుత నిరసన నిర్వహించారు. అనంతరం జిల్లా ఎస్పీ దీపికకు ఎన్డీయే కూటమి నాయకులపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న మాట్లాడుతూ తమ పార్టీ అధినేత రాహుల్‌గాంధీకి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక బీజేపీ, శివసేన నాయకులు రాహుల్‌గాంధీపై దారుణమైన వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గూనూరు వెంకటరావు, మలపురెడ్డి కోటేశ్వరరావు, బోయిన భానుమూర్తియాదవ్, కాళ్ల సత్యనారాయణ, కత్తెర శ్రీధర్ పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ ఆందోళన



ధర్నా చేస్తున్న బీజేపీ ఓబీసీ నేతలు

కొత్తూరు, సెప్టెంబరు 19: కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ అమెరికా పర్యటనలో భారత ప్రభుత్వం, భారతీయులపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బీజేపీ, ఓబీసీ నేతల ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేపట్టారు. స్థానిక బీజేపీ కార్యాలయం నుంచి రాహుల్‌గాంధీ డౌన్‌డౌన్ అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ రాహుల్ గాంధీ భారత పౌరసత్వానికి అనర్హుడన్నారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కర్రి రామకృష్ణ మాట్లాడుతూ రాహుల్ గాంధీ కుటుంబమంతా భారత వ్యతిరేకులని ఆరోపించారు. మహిళా పోలీసు స్టేషన్ మీదుగా వేల్పులవీధి, ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజాం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా

▸▸ స్థానికేతరుడుని షిఫ్ట్ ఆపరేటర్ నియామకంపై అభ్యంతరం
▸▸ బాధితురాలి కుటుంబ సభ్యులను నియమించాలని డిమాండ్



రాజాం సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న ప్రజలు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 19: స్థానికేతరుడుని రాజాం విద్యుత్ సబ్ స్టేషన్ షిఫ్ట్ ఆపరేటర్‌గా నియమించడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం మండల ప్రజలు సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేశారు. గతంలో ఇక్కడ తొమ్మిది సంవత్సరాలుగా షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేసిన ఆర్.భీమవరానికి చెందిన రొంగలి నర్సింగరావు అనారోగ్యంతో మృతి చెందారు. ఖాళీ అయిన పోస్టులో బాధిత కుటుంబాన్ని కాదని, రావికమతం మండలం దొండపూడికి చెందిన వ్యక్తిని ఎంపిక చేయడంపై దివంగత షిఫ్ట్ ఆపరేటర్ నర్సింగరావు భార్య రామలక్ష్మి చే పట్టిన ధర్నాలో పార్టీలకతీతంగా ఆర్.భీమవరం, నీలకంఠాపురం గ్రామాలకు చెందిన పలువురు సంఘీభావం ప్రకటించారు. జీవనాధారం లేని రామలక్ష్మి కుటుంబ సభ్యులను షిఫ్ట్ ఆపరేటర్‌గా ఎంపిక చేయవలసి ఉండగా, స్థానికేతరుడు నియామకంపై రెండు గ్రామాలకు చెందిన ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రామలక్ష్మి కుటుంబ సభ్యుల్లో ఒకరిని షిఫ్ట్ ఆపరేటర్‌గా నియమించాలని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజుని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. దీనికి విరుద్ధంగా ఏపీ ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు ఏకపక్షంగా స్థానికేతరుడుని నియమించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికేతరుడి నియామకం రద్దు చేసి, రామలక్ష్మి కుటుంబ సభ్యుల్లో ఒకరిని షిఫ్ట్ ఆపరేటర్‌గా నియమించే వరకు సబ్ స్టేషన్ వద్ద ఆందోళన కొనసాగిస్తామని ప్రజలు హెచ్చరించారు. రామలక్ష్మి ధర్నాకు మద్దతుగా మాజీ సర్పంచులు కోట సత్యనారాయణ, మలిరెడ్డి బాబ్జి, మల్లాం ఎంపీటీసీ సభ్యుడు శ్రీను, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెలంకాయల అప్పలనాయుడు రెండు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఆదివాసీలకు తప్పని డోలి మోతలు

▸▸ ఆరు కిలోమీటర్లు రోగిని మోసుకుని డౌనూరు పీహెచ్‌సీకి తరలింపు



జ్వర బాధితుడు లక్ష్మణరావును డోలిపై డౌనూరు ఆస్పత్రికి తరలిస్తున్న తాటిబంద గిరిజనులు

చింతపల్లి, సెప్టెంబరు 19 : గిరిజన ప్రాంతంలో ఆదివాసీలకు డోలి మోతలు తప్పడంలేదు. బుధవారం సాయంత్రం తాటిబంద గ్రామానికి చెందిన జ్వరబాధితుడు సీందరి లక్ష్మణరావుని డోలిపై ఆరు కిలోమీటర్లు మోసుకుని డోలిపై డౌనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మండలంలోని ఎ.శనివారం పంచాయతీ పరిధిలో తాటిబంద గ్రామం ఉన్నది. గ్రామంలో 50 గిరిజన కుటుంబాలు నివాసముంటున్నాయి. గ్రామానికి రహదారి సదుపాయం లేదు. డౌనూరు వెళ్లేందుకు ఒక గెడ్డ, మూడు కాలువాలు దాటుకుని ఆరు కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. రోగులు, గర్భిణులను తరచూ ఆస్పత్రికి డోలిపైనే తరలిస్తున్నారు. తీవ్ర జ్వరంతో నడవలేని స్థితిలోనున్న లక్ష్మణరావును స్థానికులు డోలిపై డౌనూరు ఆస్పత్రికి తరలి తరలించారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రహదారి సదుపాయం కల్పించాలని ప్రాంతీయులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వరద బాధితులకు స్పీకర్ అయ్యన్న ఒక నెల జీతం విరాళం



సీఎం చంద్రబాబుకు విరాళాన్ని అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, సెప్టెంబరు 19 : విజయవాడ వరద బాధితులు కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి సభాపతి అయ్యన్నపాత్రుడు ఒక నెల జీతం విరాళంగా అందజేశారు. సెప్టెంబరు 4న తన పుట్టిన రోజు సందర్భంగా వరద బాధితులకు ఒక నెల జీతాన్ని విరాళం అందజేస్తానని ప్రకటించారు. ఈ నేపథ్యంలో గురువారం విజయవాడలో సీఎం చంద్రబాబుని కలిసి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిమితి మేరకు సీఎంఆర్ఎఫ్‌కు విరాళం అందజేయాలని కోరారు.

వరద బాధితులకు కెమిక డ్రగ్స్ రూ.10 లక్షల విరాళం



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు చెక్కు అందజేస్తున్న కెమిక డ్రగ్స్ వైస్ ప్రెసిడెంట్ కలిశెట్టి సాంబశివరావు, తదితరులు

పరవాడ, సెప్టెంబరు 19: వరద బాధితుల సహాయార్థం ఫార్మాసిటీలోని కెమిక డ్రగ్స్ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమ రూ.10 లక్షలు సమకూర్చింది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కెమిక డ్రగ్స్ వైస్ ప్రెసిడెంట్ కలిశెట్టి సాంబశివరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు ఆకుల దొరబాబు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

ఎలమంచిలి, సెప్టెంబరు 19: రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ఎలమంచిలి కొక్కిరాపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ ఎం.మాణిక్యం తెలిపారు. విద్యార్థినులు కె.కుమారి, బి.గ్రేష్మ, ఎ.మణి జాతీయ పోటీలకు ఎంపిక కావడంతో వారిని గురువారం పట్టణ ఎస్ఐ సావిత్రి అభినందించారు. అలాగే యోగా కోచ్ మళ్ల రామును కూడా అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ రమాదేవి, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో విస్తృత తనిఖీలు



ఎలమంచిలి ఆర్టీసీ బస్టాండ్‌లో జాగిలంతో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ ధనుంజయరావు

ఎలమంచిలి, సెప్టెంబరు 19: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, పార్సిల్ సర్వీసు కేంద్రాల్లో గురువారం సీఐ ధనుంజయరావు, పట్టణ ఎస్ఐ సావిత్రి - పోలీసు జాగిలంతో పాటు పోలీసు సిబ్బందితో విస్తృత తనిఖీలు నిర్వహించారు. మాదకద్రవ్యాల రవాణాను అరికట్టే క్రమంలో భాగంగా ఈ తనిఖీలు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. బస్టాండ్‌లోని ప్రయాణికుల బ్యాగులు, బస్టాండ్ పరిసరాల్లో జాగిలంతో తనిఖీలు చేశారు.

పక్కాగా వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలు : జేసీ జాహ్నవి



జాహ్నవి, జేసీ

అనకాపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను పక్కాగా అమలు చేయాలని అధికారులను జేసీ జాహ్నవి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలు, శాఖల పనితీరును ఆమె సమీక్ష జరిపారు. ప్రతి 15 రోజులకు ఒకసారి యాక్షన్ ప్లాన్ అమలుపై సమీక్ష జరుపుకోవాలని సూచించారు. సమావేశంలో సీపీవో రామారావు, హౌసింగ్ పీడీ శ్రీనావాసరావు డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ, వ్యవసాయ, ఉద్యాన, డ్వామా, అటవీ, పంచాయతీరాజ్ ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్స్ కో-ఆర్డినేటర్ కుమార్ సస్పెన్షన్

అనకాపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్స్ పరీక్షా కేంద్రం డిజిటల్ కీ ఇచ్చేందుకు రూ.30 లంచం డిమాండ్ చేసి తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన జిల్లా ఓపెన్ స్కూల్స్ కోఆర్డినేటర్ ఒ.కుమార్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఎంవీ లక్ష్మిమ్మ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అవినీతి నిరోధక శాఖ అధికారులు కుమార్‌పై కేసు నమోదు చేసిన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసి ప్రభుత్వానికి నివేదిక పంపినట్టు డీఈవో తెలిపారు.

గంజాయి సాగు, రవాణాపై ఉక్కుపాదం



▸▸ పాడేరు సీఐ ధీనబందు

పాడేరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గంజాయి సాగు, రవాణా వంటి చట్టవ్యతిరేక కార్యాకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పాడేరు సీఐ డి.ధీనబందు స్పష్టం చేశారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంజాయి నిర్మూలనపై ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉందని, ఈ క్రమంలో దాని జోలికి ఎవరూ వెళ్లవద్దని, దానిని వినియోగించేందుకు సైతం సాహసించవద్దన్నారు. అలాగే గంజాయి సాగు, అక్రమ రవాణాపై పోలీసులకు ప్రజలు సమాచారం అందించాలన్నారు. అలాగే చట్టవ్యతిరేకంగా బాణసంచా తయారీ, అక్రమ నిల్వ చేయవద్దని, చట్టానికి లోబడి మాత్రమే పండగలు, వేడుకలు నిర్వహించుకోవాలన్నారు. గిరిజన ప్రాంతంలో సైతం సైబర్ నేరాలు అధికంగానే జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ డి.ధీనబందు సూచించారు.

ప్రత్యేకాధికారి స్కూళ్ల సందర్శన



గురుకులంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శర్మ

అనంతగిరి, సెప్టెంబరు 19 : మండలంలోని చిలకలగెడ్డ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం మండల ప్రత్యేకాధికారి, డిప్యూటీ కలెక్టర్ వీవీఎస్ శర్మ సందర్శించారు. విద్యార్థుల హాజరుపట్టిక పరిశీలించగా.. 29 మంది హాజరవగా 48 మంది హాజరైనట్లుగా చూపించారు. అలాగే పాఠశాల నిర్వహణపై కొందరు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో హెచ్ఎంకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. అనంతరం భీంపోల్, గుమ్మకోట సచివాలయాలను తనిఖీ చేసి, ఉదయం 10 గంటలకు ముఖ ఆధారిత హాజరు తప్పనిసరిగా వేసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయికి వెళ్లేటప్పుడు తప్పనిసరిగా మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. భీమవరం పీహెచ్‌సీని సందర్శించి, వైద్య సేవలపై ఆరా తీశారు. గుమ్మకోట గురుకులం వెళ్లారు. పాఠశాలపై వివిధ ఫిర్యాదులు వస్తున్నాయని, ఉపాధ్యాయుల తీరు మారాలని హెచ్చరించారు. పాఠశాలలోని గొడవలపై నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి నీలవేణి, ఎంపీడీవో నగేష్, వీఆర్వో కోటిబాబు, కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, లావణ్య, గుమ్మకోట సర్పంచ్ అప్పారావు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 102 మంది ఎంపిక



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ప్రశాంత్‌కుమార్

పాడేరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పాలిటెక్నిక్ కాలేజీలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 102 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 391 మంది అభ్యర్థులు పాల్గొన్నారని, వారిలో 102 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10 నుంచి రూ.20 వేలు వరకు జీతం వచ్చే ఉద్యోగాలు లభిస్తాయన్నారు. వారిని మెడిప్లస్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, అమరరాజా బ్యాటరీ, భారత్ పే వంటి సంస్థల్లో ఉద్యోగాలు పొందుతారన్నారు. అలాగే అర్హులైన నిరుద్యోగులు తమ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రశాంత్‌కుమార్ కోరారు.కార్యక్రమంలో జేడీఎం కల్యాణి, పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపల్ కె.సుజాత, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సింహాచలం పాల్గొన్నారు.

సీలేరు మార్గంలో మినీ బస్సులు నడపాలి



ఆర్‌అండ్‌బీ, ఎన్‌హెచ్ అధికారులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి బాలరాజు

చింతపల్లి, సెప్టెంబరు 19 : సీలేరు-చింతపల్లి మార్గంలో ఆదివాసీల రవాణా సమస్యను పరిష్కరించేందుకు మినీ బస్సులు నడపాలని మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు సూచించారు. గురువారం జీకేవీధి, చింతపల్లి రహదారిని పరిశీలించిన మాజీ మంత్రి ఆర్ అండ్ బీ, జాతీయ రహదారుల ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడారు. జీకేవీధి- సీలేరు ప్రధాన రహదారి సాధ్యమైనంత వేగంగా పునరుద్ధరించాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఈ ప్రాంతంలో ఆదివాసీలు రవాణ సదుపాయంలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రస్తుతం అధికారులు మినీ వాహనాలు నడిచేందుకు అనువైన రహదారిని సిద్ధం చేయడంతో జిల్లా అధికారులు ఒకటి, రెండు మినీ బస్సులను ఈ మార్గంలో నడిపితే మంచిదన్నారు. అలాగే ప్రస్తుతం చింతపల్లి మీదుగా నిర్మిస్తున్న జాతీయ రహదారి నిర్మాణంలో ఇతర గ్రామాలకు వెళ్లే మార్గాలను రవాణకు అనువుగా నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ఈఈ బాలసుందరంబాబు, ఎన్‌హెచ్ డీపీఎం తికల్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో విధిగా మెనూ అమలు



భోజనాలను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి బాలసుందరంబాబు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 19 : గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలల్లో విధిగా మెనూ అమలు చేయాలని మండల ప్రత్యేక అధికారి, ఆర్ అండ్ బీ ఈఈ బాలసుందరంబాబు అన్నారు. గురువారం ఎంపీడీవో ఉమామహేశ్వరరావుతో కలిసి ప్రత్యేక అధికారి రింతాడ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు సిద్ధం చేసిన భోజనాలను ఆయన స్వయం రుచి చూశారు. ఈసందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ విద్యార్థులకు పెడుతున్న అన్నం బాగోలేదని, విద్యార్థులకు కూర అవసరమైన పరిమాణంలో పెట్టడంలేదన్నారు. తక్షణమే బియ్యాన్ని మార్చాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం పెట్టాలన్నారు. మరో పది రోజుల్లో వసతి గృహాన్ని సందర్శిస్తానని, భోజనాల్లో పూర్తి మార్పురావాలన్నారు. లేదంటే జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తామన్నారు. అలాగే ఉపాధ్యాయులు పదోతరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషిచేయాలన్నారు. అనంతరం సంకాడ, రింతాడ, అసరాడ సచివాలయాలను ఆయన సందర్శించారు. సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకొనిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ పాపారావు పాల్గొన్నారు.

'పిల్లిగెడ్డ' పునరుద్ధరించండి

▸▸ భారీ వర్షాలకు 10 రోజుల కిందట కొట్టుకుపోయిన వంతెన

▸▸ పలు గ్రామాల ప్రజల అవస్థలు



కొట్టుకుపోయిన ఆంధ్రా ఒడిశా సరిహద్దుల్లోని పిల్లిగెడ్డ వంతెన

సీలేరు, సెప్టెంబరు 19 : ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో గత పిల్లిగెడ్డ వంతెన వద్ద డైవర్షన్ ఏర్పాటు చేసి త్వరితగతిన రెండు రాష్ట్రాల రాకపోకలను పునరుద్ధరించాలని సరిహద్దు ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పిల్లిగెడ్డ వంతెన కొట్టుకుపోయి సీలేరు మీదుగా ఒడిశాకు రాకపోకలు నిలిచిపోయిన సంఘటన తెలిసిందే. పిల్లిగెడ్డ వంతెన అవతల సరిహద్దుల్లో పిల్లిగెడ్డ, కాట్రగెడ్డ ఎస్ నేరేడుపల్లి, జీ నేరేడుపల్లిగ్రామాలు జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ పరిధిలోని గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల ప్రజలు అత్యవసరంగా ఆస్పత్రికి వెళ్లాలన్నా, రాయితీ సరుకులు తీసుకోవాలన్నా, ఇతర నిత్యావసర సామగ్రి కావాలన్నా సీలేరు రావాల్సిందే. వీరు సీలేరు పిల్లగెడ్డ వంతెన దాటి రావాలి.

పిల్లిగెడ్డ వంతెన బలిమెల జలాశయం నిర్మాణం సమయంలో డ్యాం నిర్మాణానికి అవసరమైన సామగ్రిని తీసుకెళ్ళడానికి 1964 ప్రాంతంలో నిర్మించారు. ఈ వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో గత ప్రభుత్వం హయాంలో కొత్త వంతెన మంజూరు చేశారు. కాంట్రాక్టర్ వంతెన పనులు పూర్తి చేసినప్పటికీ అప్రోచ్ పను లు పూర్తి చేయలేదు. దీంతో పాత వంతెనపై నుంచే రాకపోకలు కొనసాగుతున్నాయి.అయితే వర్షాలకు పాత వంతెన శిథిలమవగా, కొత్తవంతెనకు వేస్తున్న అప్రోచ్ కూడా కొట్టుకుపోయింది. ఇది జరిగి 10 రోజులు పైబడుతున్నా తాత్కాలికంగా రాకపోకలు సాగించేందుకు అధికారులు డైవర్షన్ మార్గాన్నైనా ఏర్పాటు చేయకపోవడం వల్ల సరిహద్దుల్లో ఉన్న గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పిల్లిగెడ్డ వంతెన వద్ద డైవర్షన్ మార్గం ఏర్పాటు చేసి ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

పోషకాహార పంపిణీలో అంగన్వాడీల పాత్ర కీలకం

▸▸ అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

అరకులోయ, సెప్టెంబరు 19 : తల్లీబిడ్డలు, గర్భిణులకు అన్ని విధాలా పోషకాహారం అందించాలన్న లక్ష్యంతో అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఆ ఉద్దేశం నెరవేరేలా సిబ్బంది కృషి చేయాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పేర్కొన్నారు. గురువారం మండలప్రజాపరిషత్ సమావేశ మందిరంలో అరకు అంగన్‌వాడీ ప్రాజెక్టు అధికారి శారద ఆధ్వర్యంలొ ప్రాజెక్టు పరిధిలో పని చేసే కార్యకర్తలతో కలిసి పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో టేక్ హోం రేషన్ అమలు చేయడం శుభపరిణామం అన్నారు. గర్భిణులు పోషకాహారం తీసుకుంటున్నదీ, లేనిదీ అంగన్‌వాడీ కార్యకర్తలు పరిశీలించాలని సూచించారు. ఎప్పటికప్పుడు సూచనలు అందించడం ద్వారా మన్యం ప్రాంతంలో పండే ఎన్నో రకాల పోషకాలున్న పంటలు, దినుసులు మిల్లెట్స్ వారికి అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రోష్నీ, ఎంపీడీవో వెంకటేశ్, కొత్తభల్లుగుడ ఎంపీటీసీ, పద్మాపురం సర్పంచ్ సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి : ఆదివాసీలు ఆరోగ్య పరిరక్షణకు స్థానికంగా లభించే పోషకాహారాన్ని తీసుకోవాలని స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి సూచించారు. గురువారం బెన్నవరం, రాజుపాకలు, లోతుగెడ్డ సెక్టార్ కేంద్రాల్లో ఐసీడీఎస్ అధికారులు పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. తొలుత గ్రామంలో ర్యాలీలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచ్ దురియా పుష్పలత, సీడీపీవో జీవీ రమణ, ఏసీడీపీవో రామలక్ష్మి, సూపర్‌వైజర్లు గౌహర్‌ఉన్నీష, సత్యవతి, విజయ కుమారి పాల్గొన్నారు.

'ఈ క్రాప్' కోసం కొండెక్కాల్సిందే!

సెల్‌సిగ్నల్స్ లేక గిరి రైతుల అవస్థలు



గిరిజనులు గుమిగూడి ఉన్న ఈ చిత్రం పాడేరు మండలం బరిసింగి కొండపైది. డోకులూరులో ఎటువంటి సెల్ సిగ్నల్స్ లేకపోవడంతో ఈ-క్రాప్ నమోదు కోసం వ్యవసాయ అసిస్టెంట్, రైతులు ఇలా కొండపైకి ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది. వారంతా పాడేరు పట్టణానికి చేరువగా ఉన్న బరిసింగి కొండ వద్దకు చేరుకుని, అక్కడ రైతులకు సంబంధించిన ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను చేపడుతున్నారు. తమ ప్రాంతంలో సెల్ టవర్లు లేక అవస్థలు పడుతున్నామని డోకులూరు ప్రాంతీయులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు.

\- ఆంధ్రజ్యోతి, పాడేరు

కాఫీ బోర్డు ఉద్యోగుల స్వచ్ఛ భారత్



సంత షెడ్ల వద్ద చెత్తను తొలగిస్తున్న కేంద్ర కాఫీ బోర్డు ఉద్యోగులు

చింతపల్లి, సెప్టెంబరు 19 : మండల కేంద్రం మార్కెట్ పరిసరాలను స్థానిక కేంద్ర కాఫీ బోర్డు ఉద్యోగులు శుభ్రం చేశారు. గురువారం కాఫీ బోర్డు ఉద్యోగులు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఎల్‌వో ప్రదీప్ కుమార్, ఉద్యోగులు సంత షెడ్లు వద్ద చెత్తను తొలగించారు. అక్టోబరు 2 వరకు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామనిజేఎల్‌వో తెలిపారు.

అతిథ్య రంగంలో గిరిజన యువతకు అవకాశాలు

▸▸ ఐడీడీఏ పీవో అభిషేక్



శిక్షణ పొందుతున్న యువతకు కిట్లు అందజేస్తున్న పీవో

అరకులోయ, సెప్టెంబరు 19 : ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో గిరిజన యువతకు అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ పేర్కొన్నారు. అరకులోయ యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో గురువారం అతిథ్య రంగంలో శిక్షణ పొందుతున్న 60 మంది గిరిజన యువతకు శిక్షణ సామగ్రి కిట్లను పీవో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణా కౌసల్యయోజన పథకం కింద యువతకు ఈ శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు ఆతిథ్య రంగంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఎంపిక చేసిన 60 మంది యువతకు నాలుగు నెలలు పాటు శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 178 మందికి శిక్షణను ఇవ్వగా 169 మంది వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలు పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ జీఆర్‌డీఎం కళ్యాణి, గురుకులం క్రీడాపాఠశాల ప్రిన్సిపాల్ మూర్తి, దసపల్లా మేనేజర్ రత్నం ఇన్‌స్ట్రక్టర్లు వర్మ, రవి, మధు తదితరులు పాల్గొన్నారు.

అనంతరం పీవో అభిషేక్ పద్మాపురం గార్డెన్‌ను సందర్శించారు. పర్యాటకుల సౌకర్యార్థం గార్డెన్‌లో లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పీవో వెంట గార్డెన్ మేనేజర్ ఒంజిబాబు, స్థానిక టీడబ్ల్యూ ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

పాఠశాలకు సామగ్రి వితరణ

అనంతగిరి, సెప్టెంబరు 19 : మండలంలోని కివర్ల పంచాయతీ తంగేళ్లబంద గ్రామంలోని గిరిజనులు తాత్కాలికంగా నిర్మించుకున్న పాఠశాలకు.. గురువారం ఆర్ఎస్ స్వచ్ఛ సొసైటీ నిర్వాహకురాలు డాక్టర్ కాంతా స్వాతి బెంచీలు, కుర్చీలు, నోట్ పుస్తకాలను అందజేశారు. ఈ పాఠశాలపై వివిధ పత్రికల్లో వచ్చిన వార్తల ద్వారా.. నిరుపేదలకు సాయం చేయాలని ముందు కు వచ్చానని, డాక్టర్ కాంతా స్వాతి తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవింద్ డాక్టర్ సేవలపై కొనియాడారు. అనంతరం ఆమెకు గిరిజన సంప్రదాయం ప్రకారం గిరిజన మహిళలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు, స్థానిక గిరిజనులు పాల్గొన్నారు.

వర్షాల బాధితులను ఆదుకోవాలి : సీపీఐ



జేసీకి వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నేతలు సత్యనారాయణ తదితరులు

పాడేరు రూరల్, సెప్టెంబరు 19 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన గిరిజన గ్రామాల ప్రజలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఐ జిల్లా సమితి బృంద సభ్యులు జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ ఆధ్వర్యంలో జేసీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడు తూ జీకే వీధి మండలంలో చట్రాపల్లి, గుమ్మరేవులు, నేరేడుపల్లి గ్రామల పరిధిలో ప్రాణనష్టంతో పాటు తీవ్ర ఆస్తినష్టానికి గిరిజన కుటుంబాలు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. మన్యంలో పలు గ్రామాలు పంట పొలాలను రైతులు నష్టపోయారన్నారు. కొన్ని పొలాలు పెద్దపెద్దలుగా మారి పంటలు చేసుకొనేందుకు వీలు లేకుండా మారాయన్నారు. అధికారులు స్పందించి పెద్ద తిన్న పంట పొలాలను సాగుకు అనుకూలంగా తయారు చేయించాలని ఆయన కోరారు. భారీ వర్షాల నేపథ్యంలో రెవెన్యూ పట్టా భూములు ఉన్న రైతులకు మాత్రమే నష్ట పరిహారం చెల్లిస్తామనడం అన్యాయమన్నారు. గిరిజనుల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు ఉన్న రైతులకు నష్ట పరిహారం చెల్లించేలా అధికారులు, ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. వరద బాధితులకు రూ. 25 వేలు ఆర్థిక సహాయంతో పాటు నిత్యవసర సరుకులను ఉచితంగా పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కె.రాజశేఖర్, కె.రాధాకృష్ణ, పోతురాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

తేలిన బలిమెల నీటి లెక్కలు

... 3వ పేజీ తరువాయి

మించకూడదని నిర్ణయం తీసుకున్నారు. అంతకంటే ఎక్కువగా వచ్చే ఇన్‌ఫ్లోను ఇరు రాష్ట్రాలు నీటిని వినియోగించుకోవాలని ఇరు రాష్ట్రాల అధికారుల మధ్య ఒప్పందం కుదిరింది. కార్యక్రమంలో ఒడిశా తరుపున పొట్టేరు ఇరిగేషన్ చీఫ్ కన్‌స్ట్రక్షన్ ఇంజనీర్ పితబాసి శెట్టి, చిత్రకొండ ఎర్త్ డ్యాం డివిజన్ ఎస్ఈ రమాకాంత పాత్ర, బలిమెల ప్రాజెక్టు సీనియర్ జనరల్ మేనేజర్ ఎస్. శివప్రసాదరావు, డిప్యూటీ జనరల్ మేనేజర్ జ్యోతిర్మయిదాస్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు ఓం ప్రకాష్‌నాయక్, రాకేష్ పాణిగ్రహి, అసిస్టెంట్ ఇంజనీర్ గడాధర్ ప్రధాన్‌లు పాల్గొనగా.. ఆంధ్రా తరుపున సీలేరు కాంప్లెక్సు ఏపీ జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.రామభద్రరాజు, ఈఈ(ఓండ్ఎం) వి.రాజేంద్రప్రసాద్, డీఈఈ టి.వెంకటమధు, ఏఈఈ సీహెచ్ సురేష్ పాల్గొన్నారు.

ఆదివాసీలకు నిలిచిన వైద్యం

... 3వ పేజీ తరువాయి

విధులకు హాజరుకావడంలేదని సిబ్బంది చెప్పడంతో రోగులందరూ స్టాఫ్ నర్సులతో సాధారణ చికిత్స చేయించుకుని ఇళ్లకు వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆస్పత్రుల్లో గర్భిణులు, జ్వర బాధితులకు ఆరోగ్య తనిఖీలు జరగడం లేదు. మూడు రోజులుగా వైద్యులు ఆస్పత్రిలో అందుబాటులో లేకపోవడంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వారపు సంత రోజైన ఏరియా ఆస్పత్రిల నుంచి ప్రత్యామ్నాయ వైద్యులను పంపించాలని రోగులు కోరుతున్నారు. మండలంలో జీకేవీధితోపాటు సీలేరు, ధారకొండ, సప్పర్ల, ఆర్‌వీనగర్, పెదవలస, జర్రెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. ఆస్పత్రికి వచ్చిన రోగులకు కేవలం స్టాఫ్ నర్సులు మాత్రమే సేవలందిస్తున్నారు.

ఎస్ఐ కొలువు సాధించిన..

... 3వ పేజీ తరువాయి

ఇద్దరు కూమార్తెలు లక్ష్మీప్రసన్న, తనుజలను జనరల్, బీఎస్సీ నర్సింగ్ చదివించింది. చిన్న కుమారుడు సాయిరామ్ పడాల్ ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు లంబసింగి ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యాభ్యాసం చేశాడు. 2016లో చింతపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ గ్రూపులో చేరాడు. తర్వాత చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ పూర్తి చేశాడు. గిరిజన సంక్షేమ శాఖ పోస్టు మెట్రిక్ వసతి గృహాల్లో నివాసముంటూ ఇంటర్, డిగ్రీ పూర్తిచేశాడు. చిన్నప్పటి నుంచి సాయిరామ్ క్రీడల్లోనూ ముందుండేవాడు. పోలీసు శాఖలో ఉద్యోగం సాధించాలని కలలు కనేవాడు. డిగ్రీ పూర్తి చేసుకోగానే 2023లో సబ్ ఇన్‌స్పెక్టర్ నోటిఫికేషన్ వచ్చింది. వెంటనే దరఖాస్తు చేసుకుని ప్రిపరేషన్ ప్రారంభించాడు. మూడు నెలలపాటు కాకినాడలోని ఓ ప్రైవేటు శిక్షణ కేంద్రంలోఎస్ఐ ఎంపిక కోసం కోచింగ్ తీసుకున్నాడు. 2023 ఫిబ్రవరిలో ప్రిలిమ్స్, సెప్టెంబరులో ఫిజికల్, అక్టోబరులో మెయిన్స్ పరీక్షలకు హాజరై ఉత్తీర్ణులయ్యాడు. 2024 ఫిబ్రవరిలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికయ్యాడు. ప్రస్తుతం అనంతపురం పోలీసు ట్రైనింగ్ కళాశాలలో శిక్షణ పొందుతున్నాడు. వచ్చే ఏడాదికి శిక్షణ పూర్తికానున్నది. ఈ సందర్భంగా సాయిరామ్ పడాల్ విలేకరులతో మాట్లాడుతూ ప్రణాళికతో విద్యలో ప్రతిభ కనబర్చితే సాధించలేనిదంటూ ఏమీలేదన్నారు. వ్యక్తిగత క్రమశిక్షణ, పట్టుదల, విద్యపై ఆసక్తి ఉంటే లక్ష్యాన్ని సులభంగా సాధించవచ్చునన్నారు.

మన్యంలో మంచు సోయగం



చింతపల్లి, సెప్టెంబరు 19 : గిరిజన ప్రాంతంలో మంచు కురుస్తున్నది. సాధారణంగా అక్టోబరు మొదటి వారం నుంచి గిరిజన ప్రాంతంలో మంచు సోయగాలు కనిపిస్తాయి. ప్రస్తుతం వాతావరణంలో కలిగిన మార్పు వల్ల సెప్టెంబరు ఆఖరిలోనే మంచు అందాలు ఆవిష్కృతమవుతున్నాయి. గురువారం ఉదయం ఎనిమిది గంటల వరకు మంచు దట్టంగా కురిసింది. దీంతో ప్రకృతి ప్రేమికులు మంచు అందాలను తిలకిస్తూ ఎంజాయ్ చేశారు.

☛ సంక్షిప్తంగా..

నేడు వివిధ మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరు రూరల్, సెప్టెంబరు 19 : అల్లూరి జిల్లాలోని వివిధ మండలాల్లో విద్యుత్ ఫీడర్లలో మరమ్మతులుచేపడుతుండడంతో శుక్రవారం పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ పాడేరు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎస్ఎం అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. పాడేరు సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ జి.ముంచంగిపుట్టు ఫీడర్‌లో చింతలవీధి, ఉబ్బెడిపుట్టు, నడిమివీధి, వల్లాపురం,దుమ్మాపుట్టు గ్రామాలకు.., చింతపల్లి మండలంలోని చింతపల్లి సబ్‌స్టేషన్ 11 కేవీ అన్నవరం ఫీడర్ పరిధిలో పశువులబంధ, కొత్తపాలెం, వంచుల, జర్రెల అన్నవరం, చెరుకుంపాకలు గ్రామాలకు, డుంబ్రిగూడ మండలంలోని 33 కేవీ లైన్ డుంబ్రిగుడలో అన్ని పంచాయతీలకు అంతరాయం ఉంటుందన్నారు. పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలకు పూర్తిగా అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వంట గ్యాస్ వినియోగదారులకు ఈ కేవైసీ తప్పనిసరి



విలేకరులతో మాట్లాడుతున్న హెచ్‌పీ గ్యాస్ జోనల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ మురళీకృష్ణ

చింతపల్లి, సెప్టెంబరు 19 : గ్యాస్ వినియోగదారులందరూ విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని హెచ్‌పీ గ్యాస్ జోనల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ మురళీ కృష్ణ తెలిపారు. గురువారం స్థానిక జీసీసీ డివిజన్ కార్యాలయంలో జిల్లాలోనున్న హెచ్‌పీ గ్యాస్ డీలర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హెచ్‌పీ గ్యాస్ జోనల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ విలేకరులతో మాట్లాడుతూ ఈ-కేవైసీ చేయించుకోవడం వల్ల కనెక్షన్లు వినియోగంలో ఉన్నదిలేదని తెలుస్తుందన్నారు. గ్యాస్ కనెక్షన్ కలిగిన వ్యక్తి మరణిస్తే సంబంధిత వారసులు పేరిట మార్చుకోవచ్చన్నారు. గ్యాస్ వినియోగదారులు ఫోన్ నంబరును కనెక్షన్‌తో అనుసంధానం చేయించుకోవాలన్నారు. సెప్టెంబరు నెలాఖరు నాటికి ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక జీసీసీ గ్యాస్ గోదాము సూపరింటెండెంట్ రమణమూర్తి, జీకేవీధి, చిట్రాళ్లగొప్పు ఏజెన్సీ నిర్వాహకులు అదృష్టరావు, కృష్ణ, భరత్ పాల్గొన్నారు.

ప్రత్యేక వైద్య శిబిరంలో 85 మంది విద్యార్థినులకు పరీక్షలు

▸▸ డీఎంహెచ్‌వో జమీల్ బాషా



అనీమియా నిర్ధారణ పరీక్షలు చేయిస్తున్న డీఎంహెచ్‌వో జమీల్ బాషా

పాడేరు రూరల్, సెప్టెంబరు 19 : అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఏపీఆర్ బాలికల పాఠశాల్లో మినుములూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో 85 మంది విద్యార్థినీలకు సినిల్ సెల్ అనీమియా నిర్ధారణ పరీక్షలు, ఆరోగ్య పరీక్షలు చేపట్టామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి షేక్ జమీల్ బాషా తెలిపారు. జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో ఆదేవాల మేరకు జిల్లా పరిధిలోని వసతి గృహాలు, పాఠశాలల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలను చేపడుతున్నామన్నారు. అందులో బాగంగా గురువారం పాడేరు ఏపీఆర్ బాలికల పాఠశాల్లో చేపట్టిన శిబిరంలో 85 మందికి సికిల్ సెల్ అనీమియా నిర్ధారణ పరీక్షలతో పాటు జ్వర లక్షణాలతో బాధపడుతున్న 9 మంది విద్యార్థినులకు రక్తపూతలు సేకరించి సాధారణ జ్వరాలుగా గుర్తించి మందులు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినీలకు పలు ఆరోగ్య సూత్రలను వివరించి పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుల్లేలి సింహాద్రి, బి.లక్ష్మణ్, హెచ్‌వీ వీవీఎల్.పాత్రో, ఏఎన్ఎం కృష్ణవేణి, హెల్త్ అసిస్టెంట్ శెట్టి నాగరాజు, ఆశా కార్యకర్తలు, ఏపీఆర్ స్కూల్ ప్రిన్సిపాల్ గణేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మలేరియా ప్రబలకుండా చర్యలు చేపట్టాలి : ఏఎంవో

అనంతగిరి, సెప్టెంబరు 19 : గ్రామాల్లో మలేరియా ప్రబలకుండా వైద్య సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని, అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారయణ పేర్కొన్నారు. మండలంలోని కాశీపట్నం సచివాలయం వద్ద అనంతగిరి, భీమవరం, లంగుపర్తి, పినకోట పీహెచ్‌సీల పరిధిలోగల ఎంపీహెచ్ఏలతో గురువారం ప్రత్యేక సమావేశమ య్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని, మలేరియా కేసు నమోదైన వెంటనే చేపట్టే చర్యలపై తగు సూచనలు చేశారు. కార్యక్రమంలోని సబ్ యూనిట్ మేనేజర్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌మా విత్తనాలు పంపిణీ

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 19 : వ్యవసాయ శాఖ ద్వారా అందిస్తున్న రాయితీ రాజ్మా విత్తనాలను గిరిరైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఎ.సీతమ్మ అన్నారు. ఏవో శ్రీనివాస్ బాబు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రైతులకు గురువారం రాయితీ విత్తనాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మండలానికి 296 క్వింటాళ్ల విత్తనాలు కేటాయించడం జరిగిందని, 18 రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అందించేందుకు తగు ఏర్పాట్లు చేసామని జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఎస్.సుభాష్‌చంద్ర, పి.పాండురంగ స్వామి, వి.లక్ష్మణ్, కూటమి నాయకులు కె.బలరాం, ఎం.చిన్నిబాబు, సూర్యానారాయణ(సూరి) తదితరులు పాల్గొన్నారు.